

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 । కనిష్ఠం : 23.0



నిండా నిర్లక్ష్యం

- ఇంటిగ్రేటెడ్ మార్కెట్లకు గ్రహణం!
- కొన్ని మార్కెట్లు రూ. కోట్ల వ్యయంతో నిర్మించినా నిరుపయోగం
- మరి కొన్నింటిని మధ్యలోనే వదిలేసి అధికారుల చోద్యం
- రోడ్లపైనే కూరగాయలు, మాంసం విక్రయాలతో ఇబ్బంది
- ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి
- కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక.. నిర్మాణ పనుల నిలిపివేత

సమీకృత మార్కెట్లతో ఇటు చిరు వ్యాపారులు, అటు ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్న తలంపుతో వాటి నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినా ఆదిలోనే గ్రహణం పట్టుకున్నది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన కొన్నింటిని ఏళ్ల తరబడి ఉపయోగంలోకి తీసుకురాలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక మరికొన్నింటిని మధ్యలోనే అసంపూర్తిగా వదిలివేశారు. నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఫలితంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పరిస్థితి తయారైంది.

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లకు గ్రహణం పట్టుకుంది. రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన కొన్ని మార్కెట్లను సంవత్సరాలుగా ఉపయోగంలోకి తీసుకురాకపోగా.. నిర్మాణంలో ఉన్న మార్కెట్లను నిర్లక్ష్యం చేసి.. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను నిలిపివేసిన దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వం రోడ్లపైన కూరగాయలు, పండ్లు, మాంసం, చేపలు విక్రయించకుండా ఉండటం కోసం చిరు వ్యాపారులకు సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆయా జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లోని ప్రైమ్ ఏరియాల్లో రూ. కోట్లు విలువ చేసే స్థలం కేటాయించారు. కానీ ఇప్పటివరకు ఎక్కడా పూర్తిస్థాయిలో మార్కెట్లను అందుబాటులోకి తీసుకురాలేదు. ఇంకా చిరువ్యాపారులు రోడ్లపైనే విక్రయాలను కొనసాగిస్తున్నారు. దీనివల్ల అటు వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతుండగా.. ఇటు రోడ్లపైన దుమ్మూధూళితో శుభ్రమైన కూరగాయలు, పండ్లు ప్రజలకు లభించడం లేదు. ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్లలో కూరగాయలు, పండ్లు, సూపర్ మార్కెట్, బ్యాంకు, మాంసం విక్రయాల కోసం అనేక వసతులను కల్పించగా.. వాటిని వినియోగంలోకి తీసుకువస్తే చాలా ఉపయోగాలు ఉంటాయి. గత ఎన్నికల్లో ప్రభుత్వం మారిన తర్వాత ఈ నిర్మాణాలను పూర్తిగా అటకెక్కించారు. కాంట్రాక్టర్లు పనులు వదిలేసి వెళ్లగా.. నిర్మాణాలు చివర్లో ఉన్నవాటిని ఇతర అవసరాల కోసం వినియోగించడానికి ప్రస్తుత పాలకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పనుల నిలిపివేత...

మహబూబ్‌నగర్ జిల్లాలో మోడ్రన్ రైతు బజార్ పేరిట 2018లో అబ్దుల్ ఖాదర్ దర్గా వద్ద మార్కెట్ నిర్మాణం చేపట్టారు. రూ. 5.50 కోట్లు కేటాయించగా.. అందుకు రూ. 3.37కోట్లు ఖర్చు చేసి.. గ్రౌండ్ ఫ్లోర్ పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చారు. మిగతా పనులను అలాగే వదిలేశారు. అలాగే ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలో మూడు మార్కెట్ల నిర్మాణాలను ప్రారంభించారు. మెట్టుగడ్డ వద్ద ఎకరా స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను రూ. 5.5 కోట్లతో ప్రారంభించగా.. ఫినిషింగ్ వర్క్స్ చేయాల్సి ఉంది. అయితే ఈ భవనాన్ని ఇతర అవసరాల కోసం వినియోగిస్తారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత రైతుబజార్ వద్ద మరో 2వేల చదరపు అడుగుల్లో వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టగా.. స్లాబ్ మాత్రమే వేసి.. వదిలేశారు. పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద 2019లో రూ. 6 కోట్లతో ఎకరా విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. రెండు ఫ్లోర్ల నిర్మాణం జరిగిన తర్వాత పనులు ఆగిపోయాయి. జడ్చర్ల పట్టణంలో రూ. కోటితో రైతు బజార్ నిర్మాణం చేపట్టారు. అది నిరుపయోగంగా మారింది. అలాగే ఇదే పట్టణంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. బిల్లులు రాకపోవడంతో పనులు పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. నాగర్‌కర్నూలు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను పాత గంజ్‌లో రూ.ఏడు కోట్లతో చేపట్టారు. అప్పటి పంచాయతీరాజ్ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయగా.. ఇంకా పనులు పూర్తికాలేదు. రూ. 1.50 కోట్ల బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది.



నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

నిర్మించి.. వదిలేశారు...

నారాయణపేట జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 8 కోట్లు వెచ్చించింది. ఈ మార్కెట్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవం కూడా పూర్తయ్యింది. అయినా దుకాణాల కేటాయింపు విషయంలో పట్టింపు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. గతంలో అప్పటి సీఎం కేసీఆర్ ఈ మార్కెట్ మోడల్ బాగుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే మోడల్‌ను అనుసరించాలని ప్రతిపాదించారు. ఈ మార్కెట్‌ను నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ. 1.20కోట్లు మాత్రమే చెల్లించగా.. మిగతా మొత్తం పెండింగ్‌లో ఉంది. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాత గంజ్‌లో సెప్టెంబరు 29, 2021న అప్పటి మార్కెటింగ్ శాఖ మంత్రి రూ. 19 కోట్లతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కు శంకుస్థాపన చేయగా.. రెండేళ్లలో నిర్మాణం పూర్తిచేశారు. దాదాపు సంవత్సరకాలంగా ఆ మార్కెట్ వృథాగా ఉంది. ఇటీవల దుకాణాల అద్దె కోసం చర్యలు చేపట్టారు. ఇదే జిల్లాలో సింజెంట కంపెనీ క్లీన్ అండ్ గ్రీన్ నిధులు రూ. 2.80 కోట్లతో పెబ్బేరు రోడ్డులో వే సైడ్ మార్కెట్‌ను 2021లో శంకుస్థాపన చేశారు. 2023లో సింజెంట గ్లోబల్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు.

ఇందులో 78 దుకాణాలు ఉండగా.. క్యాంటీన్, బేబీ ఫీడింగ్, పిల్లలు ఆడుకోవడానికి పార్కు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రారంభించింది మొదలు.. నేటి వరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ఆ రోజు కొందరు వ్యాపారులను తీసుకువచ్చి ప్రారంభించగా.. తర్వాత వదిలేశారు. జన సంచారం ఎక్కువగా ఉన్న దారుల్లో కాకుండా ఊరికి దూరంగా వేసైడ్ మార్కెట్ నిర్మించడం వల్లనే వ్యాపారులు ఎవరూ వెళ్లడం లేదు. బలవంతంగా ఒకరిద్దరిని తరలించినా.. వారు అక్కడ వ్యాపారం చేయడానికి అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. గద్వాల జిల్లా కేంద్రంలో రూ. 12 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను 90శాతం పూర్తిచేశారు. కాంట్రాక్టర్‌కు 60శాతం బిల్లులు చెల్లించారు. అక్కడ మంచినీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌కు ఒక్కరోజు ముందు హడావిడిగా ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకురాలేదు.



మహబూబ్‌నగర్ ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద స్లాబులు వేసి వదిలేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

పడకేసిన పశువైద్యం



వ్యాధి సోకిన గొర్రెకు ఇంజక్షన్ ఇస్తున్న గొర్రెల కాపరులు(ఫైల్)

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 12: ఇటీవ ల ఏడతెరిపిలేని వర్షాలకు మనుషులతో పా టు మూగజీవాలు కూ డా రోగాలబారిన పడుతున్నాయి. ప్రతీ వర్షకాలంలో మూగజీవాలకు వైద్యం అందక వేలాదిగా మృత్యువాతపడుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం నుంచి కనీసం గోలి మాత్రలు కూడా అందడం లేదని రైతులు వాపోతున్నారు.

సిబ్బంది కొరతతో చాలా గ్రామాలకు సరైన వైద్య సదుపాయం అందడం లేదు. జోగుళాంబగద్వాల జిల్లాలో గొర్రెలు 5,77,444, మేకలు 66817, గో జాతి పశువులు 47,902, బర్రెలు 49,698 ఉన్నాయి. సుమారు 60వేల మంది రైతులు వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో పశు వైద్యశాలలు 19, గ్రామీణ పశువైద్యశాలలు 25, అలంపూర్, గద్వాల పట్టణాల్లో ఏరియా ఆసుపత్రులు ఒక్కొక్కటి ఉన్నాయి. వీటిలో రెగ్యులర్ డాక్టర్లు తొమ్మిది మంది, కాంట్రాక్టు పద్ధతిలో ముగ్గురు డాక్టర్లు ఉండగా, పశువైద్య సహాయకులు 18 మంది, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్ నలుగురు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌లు ఇద్దరు, వెటర్నరీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌లు ముగ్గురు మాత్రమే ఉన్నారు. డాక్టరు పోస్టులు కాకుండానే ఇంకా 30 పోస్టులు ఖాళీ ఉన్నట్లు సమాచారం.

ఎక్కడ గోపాలమిత్రలు?

సిబ్బంది కొరతతో పాటు ఉన్న సిబ్బంది మారుమూల పల్లెలకు వెళ్లలేని పరిస్థితులలో గోపాలమిత్రలను నాటి ప్రభుత్వం నియమించింది. వారు ప్రథమ చికిత్సతో పాటు సూడీ పరీక్షలు, గర్భధారణ ఇంజక్షన్‌లు చేయాల్సిఉంది. కానీ చాలా గ్రామాలకు వీరి సేవలు అందడంలేదు. ఒకవేళ వీరిని ఆశ్రయించిన జీవానికింత చొప్పున చార్జీ చేస్తున్నారని తెలుస్తున్నది. పైగా మందులన్నీ ప్రైవేటు దుకాణాల నుంచే తెప్పిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే మందులు గ్రామీణపశువులకు అందడం గగనంగా మారింది.

సీజనల్ వ్యాధులతో సతమతం

వేలాదిమందికి ఉపాధినిచ్చే మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉంది. శీతాకాలం కావడం, ఏడతేరిపిలేని వర్షాల కారణంగా గాలిలో తేమశాతం అధికంగా ఉండటంతో ముఖ్యంగా గొర్రెలు, మేకలు నీలినాలుక రోగం, మూతివాపు, జొల్లువాపు, కాలుగిట్టలలో పుండు వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటికి ప్రతీ ఏటా రెండుసార్లు టీకాలు వేయాల్సి ఉంది. కానీ కనీసం మందుబిళ్లలు కూడా కరువయ్యాయని రైతులు అంటున్నారు. ప్రైవేటు మెడికల్ షాపులను ఆశ్రయించి ప్రైవేటు కాంపౌండర్‌లు లేదా తామే స్వయంగా వైద్యం చేసుకుంటున్నామని రైతులు అంటున్నారు. పారా మెడికల్ సిబ్బంది నియామకం లేక ఆరేళ్లు అవుతుంది. పాడిపరిశ్రమ, మాంసం విక్రయాలు పెరుగుతున్నా పోషణభారం తో పాటు సరైన వైద్యం అందని కారణంగా పశుసంపద తగ్గుతూ వస్తున్నది.

సీజనల్ వ్యాధులకు నివారణే మార్గం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు గాలిలో తేమశాతం అధికం కావడం చేత చిన్నపాటు జీవాలపై గొర్రెలు, మేకల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న మాట వాస్తవమే. వీటికి చికిత్సతో పాటు వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరుచేసి నివారించాలి. మూతివాపు, జొల్లురోగాలకు టీకాలు అందజేశాం. ఇంకా టీకాలు అందని గ్రామాలేమైనా ఉంటే వాటిని పరిశీలించి టీకాలు వేస్తాం. ప్రతీ గ్రామానికి గోపాలమిత్ర సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

శంకరయ్య, పశు వైద్యాధికారి

ఎయిడ్స్ నియంత్రణ

ప్రతీ ఒక్కరి బాధ్యత

- నియంత్రణపై విస్తృత అవగాహన కల్పించాలి
- సంతృప్తిని వ్యక్తం చేసిన అమెరికా బృందం



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అమెరికా ఎయిడ్స్ సంస్థ బృందం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), సెప్టెంబరు 12: ఉమ్మడి జిల్లాలో ఎయిడ్స్‌ను నియంత్రించేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని అమెరికా ఎయిడ్స్ సంస్థ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం అమెరికా ప్రెసిడెంట్ ఎమర్జెన్సీ ఫండ్ ఫర్ ఎయిడ్స్ రిలీఫ్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనుబంధ స్వచ్ఛంద సంస్థ యూఎస్ ప్రతినిధులు 13 మందితో పాటు టీఎస్ సాక్స్ ప్రతినిధులు ఆరుగురు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఉమ్మడి జిల్లా ఏఆర్‌టీ సెంటర్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఏఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సౌకర్యాలు, అమలు చేస్తున్న పథకాలు, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో ఎయిడ్స్ నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, ముఖ్యంగా దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో ఏఆర్‌టీ సెంటర్‌లో అందుతున్న సేవలు, రోగుల వివరాలు, పురోగతిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పద్మ, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హస్సేన్‌లు వివరించారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 11వేల మంది హెచ్‌ఐవీ ఎయిడ్స్ రోగులు ఉన్నారని, వారందరికీ ఉచితంగా మందులు ఇస్తున్నామని, ప్రతీ నెల మందులు ఎంతమంది వేసుకుంటున్నారో కూడా పర్యవేక్షిస్తున్నామని కమిటీ సభ్యులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఉమ్మడి జిల్లాకు టీసాక్స్ ద్వారా అందిస్తున్న నిధులను వినియోగిస్తున్నామని తెలిపారు. టీసాక్స్ జాయింట్ డైరెక్టర్ కరుణశ్రీ, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, డాక్టర్ భాస్కర్ నాయక్, డీపీఎం శ్రీశైలం, సీఎస్‌టీ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాస్ పోస్టు

భర్తీ అయ్యేనా?

- సూపరింటెండెంట్ లేని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి - మార్చి 14 నుంచి ఖాళీగా ఉన్న కుర్చీ
- కరువైన పర్యవేక్షణ - ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో నెట్టుకొస్తున్న పెద్దాసుపత్రి

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి



వనపర్తి వైద్యవిభాగం, సెప్టెంబరు 12: వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ కుర్చీ ఖాళీగా దర్శనమిస్తున్నది. గత ప్రభుత్వం జిల్లాకు మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల మంజూరు చేసినప్పటికీ అందుకు అనుగుణంగా వైద్యులను నియమించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనరల్ ఆస్పత్రిని పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్ పోస్టు గడిచిన ఆరు మాసాలుగా ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో కాలం నెట్టుకొస్తున్నారు. ఈ ఏడాది మార్చి 14న ఆనాటి సూపరింటెండెంట్‌గా విధుల్లో ఉన్న డాక్టర్ నరేంద్రకుమార్ హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి బాధ్యతలు కలిగిన సూపరింటెండెంట్ లేకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

నిత్యం సమస్యలే..

పూర్తిస్థాయి బాధ్యతలతో అధికారి లేకపోవడం వల్ల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిత్యం సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. ఈ ఏడాది జూన్ మాసంలో కాలం చెల్లిన మందులు కుప్పలుకుప్పలుగా డంపింగ్ యార్డ్‌లో పారబోశారు. మునిసిపల్ ట్రాక్టర్లలో యథేచ్ఛగా ఆస్పత్రిలో నుంచే మందులను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నా చూసుకునే వారే లేకుండా పోయారని అప్పట్లో వైద్యులే చర్చించుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా పెద్దసుపత్రిగా ఉన్న జనరల్ ఆస్పత్రి నుంచి నిత్యం మహబూబ్‌నగర్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు రెఫరల్స్ జరుగుతున్నాయి. వీటితో పాటు జూన్ 15న ఆస్పత్రిలో పని చేసే శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్‌కేర్ కార్మికులు సరైన సమయంలో తమకు వేతనాలు చెల్లించడం లేదంటూ ఆస్పత్రి ముందు ధర్నా చేశారు. ఇదే వ్యవహారంలో ప్రభుత్వం నుంచి వేతన బడ్జెట్ విడుదలైనా అధికారుల నిర్లక్ష్యం కారణంగా విచారణ పేరుతో వేతనాలను మూడు మాసాలుగా నిలిపేశారు. దీంతో కార్మికులు ధర్నా చేయడానికి పూనుకున్నారు. అదేవిధంగా జూలై 21న ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులు జనరల్ ఆసుపత్రిలో సర్జరీ అయిన పేషంట్‌ను బయాప్సీని పరీక్షల కోసం వైద్యుల ప్రమేయం లేకుండా తీసుకెళ్లారు. అంతేకాకుండా వివిధ రకాల వైద్య పరీక్షలకు కూడా ప్రైవేటు డయాగ్నోస్టిక్ కేంద్ర నిర్వాహకులు ప్రభుత్వ ఆస్పత్రిలోకి వచ్చి స్వేచ్ఛగా తీసుకెళుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శలు గుప్పిస్తున్నాయి.

ఈ వ్యవహారాలన్నీ 'ఆంధ్రజ్యోతి' నిఘాతో ● డంపింగ్ యార్డ్‌లో డ్రగ్స్: ● విచారణ పేరుతో వేతనాలు నిలిపివేత: ● పేరుకే పెద్దాసుపత్రి: ● ప్రైవేటు ల్యాబ్‌లకు రెఫర్: వంటి పలు శీర్షికలతో వెలుగులోకి తెచ్చింది.

వైద్యుల కోసమే ప్రయత్నాలు చేస్తున్నాం



నేను కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులపై నిత్యం పర్యవేక్షిస్తూనే ఉన్నాను. జనరల్ ఆస్పత్రిలో వైద్యుల కొరత కొంత ఇబ్బందులు పెడుతున్నది. సూపరింటెండెంట్ పోస్టు గురించి ప్రభుత్వానికి నివేదించాం. అలాగే రేడియాలజిస్టు పోస్టుల విషయంలో వైద్యులు ఇక్కడికి రావడానికి అయిష్టత చూపుతున్నారు. గతంలో జరిగిన పరిణామాలపై విచారణ జరిపిస్తాం. వైద్య పరమైన సమస్యలు కాబట్టి సున్నితంగా వ్యవహరించాల్సి ఉంటుంది. చాలా వరకు వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి ప్రకటనలు కూడా ఇచ్చాం. రేడియాలజిస్టులు ఉంటే తప్పకుండా తీసుకుంటాం. వైద్యులకు పూర్తి రక్షణ భద్రత కల్పిస్తాం.

- ఆదర్శ్ సురభి, కలెక్టర్, వనపర్తి

తాజాగా స్కానింగ్ బంద్

ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపడుతున్న తరుణంలో మాతా శిశు సంరక్షణ కేంద్రం ద్వారా రికార్డు స్థాయిలో కాన్పులు జరుగుతున్నాయి. ఈ మేరకు ఆసుపత్రిలో స్కానింగ్ సేవల అంశం ఎంతో ప్రాముఖ్యతతో ముడిపడి ఉంటుంది. గతంలో జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ విధులు నిర్వహించడానికి ఇద్దరు సీనియర్ రెసిడెంట్ (ఎస్‌ఆర్) రేడియాలజిస్ట్ వైద్యులు ఉండేవారు. ఇటీవలే వారి కాలపరిమితి (సంవత్సరం) ముగియడంతో వెళ్లిపోయారు. ముందస్తుగా ఈ విషయాన్ని గుర్తించి, కలెక్టర్‌కు సమాచారం చేరవేసి ఉండి ఉంటే కాలపరిమితికి రెండు నెలల ముందే డీఎంఏకు ప్రతిపాదనలు పంపడం లేదా, ఉన్నవారినే మరి కొన్ని నెలల పాటు కొనసాగించుకునేలా చర్యలు తీసుకుని ఉంటే నేడు ఈ దుస్థితి వచ్చేది కాదని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో గర్భిణులకు స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల కారణంగా ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్న గర్భిణులకు రూ. ఆరు వందల నుంచి రూ. 15 వందల వరకు ఆర్థిక భారం తప్పడం లేదు. ఈ సమస్యలన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి పూర్తిస్థాయి సూపరింటెండెంట్ పోస్టును ప్రభుత్వం భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కృష్ణా ప్రాజెక్టులకు తగ్గిన వరద

గద్వాల, సెప్టెంబరు 12 : కృష్ణా బేసిన్‌లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆల్మట్టి, నారాయణపూర్‌లకు వరద తగ్గుతున్నది. భీమా నుంచి కూడా వరద తగ్గుతున్నది. గురువారం ఆల్మట్టికి 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతేమొత్తం అవుట్‌ఫ్లో ఉన్నది. నారాయణపూర్‌కు ఇన్‌ఫ్లో 45 వేల క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 42,520 క్యూసెక్కులు ఉన్నది. జూరాలకు 90 వేల క్యూసెక్కులు ఉండగా అందులో భీమా నది నుంచి 25 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. నాలుగు గేట్ల ద్వారా 28,300 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 37,021 క్యూసెక్కులు శ్రీశైలం ప్రాజెక్టుకు వదులుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు 24,776 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్ల ద్వారా 8,952 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 4700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సుంకేసులకు 22,621 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 20,196 క్యూసెక్కులు శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.50 లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పడిపోవడంతో రెండు గేట్ల ద్వారా 55,782 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 68 వేల క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 213.40 టీఎంసీల నిల్వకు చేరుకున్నది.

పునరావాసం కోసం ఎదురుచూపు

- ప్లాటుతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలంటున్న నిర్వాసితులు - రెండేళ్లయినా పూర్తి కాని పనులు



అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణం

జడ్చర్ల, సెప్టెంబరు 12 : పునరావాసం కోసం ముంపుగ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని ఉదండాపూర్, వల్లూరు, రేగటిపట్టితండా, చిన్నగుట్టతండా, తుమ్మలకుంటతండా, ఒంటిగుడెసతండాతో పాటు నవాబ్‌పేట మండలంలోని శ్యామగడ్డతండా పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథ కంలో 16 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్నాయి. రిజర్వాయర్ నిర్మాణంలో ఉదండాపూర్ పంచాయతీ తోపాటు పరిధిలోని ఒంటిగుడిసెతండాలలో కలిపి 2016 సంవత్సరం వరకు అధికారికంగా 727 ఇళ్లు ఉన్నాయి. ఆ తర్వాత సంవత్సరం నుంచి మరో 400 ఇళ్ల నిర్మాణం జరిగి ఉంటాయన్న అంచనా ఉంది. కాగా యూబీఆర్ ప్రకారం 1,173 ఇళ్లు నమోదయ్యాయి. అలాగే వల్లూరు పంచాయతీతో పాటు రేగటిపట్టితండా, చిన్నగుట్ట తండా, తుమ్మలకుంటతండాలలో 2016 నాటికి అధికారికంగా 439 ఇళ్లు నమోదయ్యాయి. ఆ తర్వాత సంవత్సరం నుంచి దాదాపు 300పై చిలుకు ఇళ్ల నిర్మాణం చేపట్టారని తెలిసింది.

పునరావాసానికి 299 ఎకరాల భూసేకరణ

పునరావాసం కల్పించేందుకు జడ్చర్ల నుంచి దేవుని గుట్టతండాకు వెళ్లే దారిలో 299 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఇప్పటికే భూమి లెవలింగ్, రాళ్ల తొలగింపు ప్రక్రియ చేపట్టింది. ముంపువాసులకు 300 గజాల చొప్పున ప్లాటును కేటాయించేలా లేఅవుట్‌ను తయారు చేయించారు. ప్లాటు ను వెంటనే కేటాయించాలని, అదేవిధంగా వాటిలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇవ్వాలని ముంపువాసులు డిమాండ్ చేస్తున్నారు. కాగా గడిచిన సంవత్సరం నుంచి పునరావాసం కల్పించే ప్రాంతంలో జరగాల్సిన అభివృద్ధి పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఇప్పటికే తయారు చేసిన లేఅవుట్‌లో 2,850 ప్లాట్లు ఉండేలా నిర్ణయించారు. ఇప్పటికే 19 ఎకరాలలో దాదాపు అన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. 280 ఎకరాలలో పనులను చేపట్టాల్సి ఉంది. పునరావాస కేంద్రం అభివృద్ధికి పునరావాస కమిషనర్ రూ.172కోట్లను మంజూరు చేశారు.

రూ.25లక్షల ప్యాకేజీ వచ్చేలా..

ముంపునకు గురవుతున్న ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు ఐదు తండాలలోని కుటుంబాలకు రూ.25లక్షల ప్యాకేజీ ఇప్పించేందుకు కృషి చేస్తున్నాం. రిజర్వాయర్ నిర్మాణానికి ఇప్పటికే భూములు ఇచ్చారు. గ్రామాలు సైతం ముంపునకు గురవుతున్నాయి. సర్వం కోల్పోతున్న ముంపువాసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

- జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే

పేట-కొడంగల్ ఎత్తిపోతలు అమలైతే..

కోస్గికి సాగునీరందుతుందా?

- దండం చెరువును నింపేందుకు అధికారుల ప్రణాళిక
- బొంరాస్‌పేట చెరువు నుంచి గ్రావిటీ ద్వారా నింపేందుకు సమాయత్తం
- ముఖ్యమంత్రి ఆదేశాలతో చర్యలు

కోస్గి, సెప్టెంబర్ 12: కోస్గి దండంచెరువు నింపితేనే ఇక్కడి రైతుల పంటలు సస్యశ్యామలంగా ఉంటాయని, అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా ప్రధానంగా 1.10లక్షల ఎకరాలకు కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో తీసుకొచ్చారు. కృష్ణానది మిగులు జలాలు భూత్పూర్ రిజర్వాయర్ వద్ద ఎత్తి ఉట్కూర్ చెరువు, అక్కడి నుంచి ఎత్తిపోసి జయమ్మ చెరువుకు, కానుకుర్తి చెరువు నుంచి ఎత్తి దౌల్తాబాద్ చెరువుకు అక్కడి నుంచి బొంరాస్‌పేట చెరువుకు లిఫ్ట్‌ల ద్వారా ఎత్తిపోస్తారు. అయితే బొంరాస్‌పేట చెరువు ఎత్తుగా ఉండటంతో కోస్గి దండంచెరువు దిగువన ఉండటంతో గ్రావిటీ ద్వారా దండం చెరువు నింపేందుకు అధికారులు ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. సుమారు 20 కిలోమీటర్ల పొడవున కాల్వల ద్వారా దండంచెరువు నింపుతారు.



కోస్గి దండంచెరువు

ఈ చెరువు నింపితే కోస్గి రైతుల ఆనందానికి అవధులు ఉండవు. దండం చెరువు సుమారు 59 ఎకరాలలో ఉంటుంది. అయితే ఈ చెరువుకు ఎఫ్‌టీఎల్ సుమారు 250 ఎకరాలు ఉంటుంది. సుమారు 200 ఎకరాల మేర చుట్టూ రైతుల పంటలు మునుగుతాయి. ఈ చెరువు తూము ద్వారా నీరు వదిలితే కోస్గి, మాసాయిపల్లి, నాచారం, ఈజీపూర్, తేగాపూర్ రైతుల పొలాలకు సుమారు 820 ఎకరాలకు సాగునీరు అందనుంది. ఈ చెరువు అలుగుపారితే దిగువన గొలుసు కట్టుగా దేవుడి చెరువు, నాచారం కోమటి చెరువు, ఉప్పు సముద్రం, నాగుల చెరువు, మాసాయిపల్లి పరం చెరువు, కడంపల్లి ఊర చెరువు నిండుతాయి. ఈ గొలుసుకట్టు చెరువుల కింద మరో 300 ఎకరాలు సాగవుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదంతా పారాలంటే కాల్వల పూడిక తీయాలి. ప్రస్తుతం ఈ కాల్వలు పూడుకుపోవడంతో పాటు ఆక్రమణకు గురయ్యాయి. వాటిని అధికారులు సర్వేచేసి పూడిక తీసేందుకు సిద్ధమవుతున్నారు.

మా పంటలు బాగా పండుతాయి



దండం చెరువు నిండితేనే మా పంటలు బాగా పండుతాయి. భూగర్భ జలాలు పెరుగుతాయి. ఈ చెరువు నిండక సుమారు 30ఏళ్లు అవుతుంది. ఎప్పుడో మా చిన్నతనంలో నిండిందంట.. మాక్కూడా అంతగా తెలియదు. ఇప్పుడైనా నిండితే బాగుంటుంది.

- సంజీవ, రైతు, కోస్గి

ముఖ్యమంత్రి కృషి..



కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఎత్తిపోతల పథకం అమలైంది. కృష్ణానది నీళ్లు మా పొలాలకు వస్తాయంటున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ ఎత్తిపోతల ఊసే ఎత్తలేదు. మరో మూడేళ్లలో నీళ్లు వస్తాయన్నందుకు సంతోషంగా ఉంది.

- ఆనంద్, రైతు, కోస్గి

రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 12: రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 14 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగాసన టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను యోగాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు గురువారం వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14న ఉదయం 9:30 గంటలకు స్టేడియం మైదానంలో రిపోర్టు చేయాలని కోరారు.

బాలుర జట్టు వివరాలు

అండర్-8, 10 మణిదీప్, శ్రీనిష్, అరవింద్‌సాయి, అండర్ -10, 12 జట్టులో సంజయ్‌కుమార్, హరి కృష్ణ, హర్షిత్, ధనూష్, అండర్ 12-14 జట్టులో చరణ్, బాలు, ప్రేమ్‌చౌహన్, సుశీల్‌కుమార్, సుజన్ కుమార్, అండర్ -14, 16 జట్టులో తిరుపతి, వరుణ్, శివతేజ, అఖిల్, అవినాష్, అండర్ - 16, 18 జట్టులో ప్రవీణ్, చైతన్య, నవీన్, విశాల్, అండర్ 18, 21 జట్టులో సాగర్, మధు, ఆకాశ్, అండర్- 25, 30 జట్టులో ప్రవీణ్, శ్రీకాంత్, 45 జట్టులో వెంకటేశం, మల్లేశ్ ఉన్నారు.

బాలికల జట్ల వివరాలు

అండర్-8, 10 జట్టులో రాధిక వర్షిణి, అఫ్రీన్, వైష్ణవి, నిహారిక, హంశు, అండర్-10, 12 జట్టులో సంధ్యారాణి, వర్షిణి, స్వప్న, కృష్ణవేణి, నవిత, అండర్-12, 14 జట్టులో సింధూ రాయ్, నందిని, వర్షిత, పవిత్ర, శ్రీజ, అండర్ - 16, 18 జట్టులో శిరీష, ఎం.సింధూ, నందిని, భార్గవి, అఖిల, అండర్-18, 21 జట్టులో స్వప్న, శ్వేత, కల్యాణి, అంకిత, కావేరి, అండర్ - 25, 30 జట్టులో బాలమణి, అండర్- 45 జట్టులో వనజారెడ్డి ఉన్నారు.

వలస కార్మికుల జీవనస్థితిపై సర్వే

జడ్చర్ల, సెప్టెంబరు 12 : జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలలో పనిచేస్తున్న వలస కార్మికుల జీవన స్థితిపై గురువారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య సర్వే నిర్వహించారు. బిహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల జీవితాలు దుర్భర పరిస్థితిలో ఉన్నాయని సీఐటీయూ నాయకులు తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ తదితర సౌకర్యాలను కార్మికులకు పరిశ్రమల యాజమాన్యాలు కల్పించడంలేదని ఆరోపించారు. అనుకోని ప్రమాదాలలో మృతిచెందిన కార్మికుల మృతదేహాలను రాత్రికి రాత్రే వారి స్వస్థలాలకు తరలిస్తున్నారని వివరించారు. వలస కార్మికుల కష్టం, ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలతో పరిశ్రమల యాజమాన్యాలు కోటీశ్వరులు అవుతున్నారని, కార్మికులు మాత్రం దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లక్ష్మారెడ్డి, జీఎంఆర్‌కు మంత్రి పొంగులేటి పరామర్శ



లక్ష్మారెడ్డితో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల/తిమ్మాజిపేట/చిన్నచింతకుంట, సెప్టెంబరు 12 : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తిమ్మాజిపేట మండలంలోని ఆవంచకు గురువారం చేరుకున్నారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆవంచలో లక్ష్మారెడ్డి కుటుంసభ్యులను మంత్రి పరామర్శించారు. వారితో పాటు రాజ్యసభ సభ్యుడు సంతోష్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యుడు వినోద్, పరామర్శించి శ్వేతారెడ్డి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అదే విధంగా జడ్చర్ల పట్టణంలోని క్రాస్‌రోడ్డు ప్రాంగణం వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పూలబొకె అందజేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీవో నవీన్, జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి ఉన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని దమాగ్నాపూర్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడి, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి ఎమ్మెల్యే కుటుంబసభ్యులను పరామర్శించారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్‌ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్‌ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు బీఎస్ఎస్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫులెయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!

» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..


హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్య డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలే దని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ చైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయింసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డిఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే.. వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్య లోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.



ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం చేయండి

అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబర్ 12: ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ , మునిసిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో ఎల్ఆర్ఎస్‌పై మునిసిపల్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అక్రమ లే అవుట్లు , ప్లాట్లు జిల్లాలో ఎన్ని ఉన్నాయి. ఎక్కడెక్కడ ఉన్నాయనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న యజమానులు ఎక్కడెక్కడ ఉన్నారు. అనేది గుర్తించి నిబంధన ప్రకారం ఉన్న వాటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అందుకు అనుసరించాల్సిన మెళకువలు, నిబంధనలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ భవనాన్ని ఉపయోగంలోకి తేవాలి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, సెప్టెంబరు 12: రూ.కోట్లు వెచ్చించి వనపర్తిలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత భవనాలు లేక జిల్లాలో అనేక విద్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటి కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. అలాంటిది కోట్ల రూపాయలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ భవనాన్ని నిరుపయోగంగా ఉంచడం సరైంది కాదన్నారు. వీలైనంత త్వరగా ఇంటిగ్రేటెడ్ భవనాన్ని, టౌన్‌హాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వైస్‌చైర్మన్ రామకృష్ణారెడ్డి, మునిసిపల్ చైర్మన్‌మహేష్, కౌన్సిలర్ నక్క రాములు, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ సూరి, లతీఫ్, నాయకులు గంధం శర వంద, శ్రీహరి రాజు, సత్యశీలరెడ్డి పాల్గొన్నారు.

చదువుకుంటేనే ప్రపంచంతో పోటీ

గోపాల్‌పేట, సెప్టెంబరు 12: చదువుతోనే మనం ప్రపంచంతో పోటీ పడి ఉన్నత శిఖరాలకు ఎదుగుతామని ఎమ్మెల్యే అన్నారు. గురువారం మండలంలోని బుద్దారంలో ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, అప్పుడే ఉన్నతస్థాయికి ఎదుగుతామని చెప్పారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న గదులను పరిశీలించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, ఎమ్మార్వో తిలక్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తులు అచ్యుతరామారావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ దక్కించుకున్న ముస్లిం యువకులు




గణపతి లడ్డూతో తాజొద్దీన్, మహమ్మద్

చిన్నంబావి, సెప్టెంబరు 12: మండల పరిధిలోని పెద్దబిల్కు గ్రామంలో కుల మతాలకు అతీతంగా ముస్లిం యువకుడు వేలంలో గణపతి లడ్డూను దక్కించుకున్నాడు. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గణపతిని ప్రతిష్ఠించి పూజలు, అభిషేకాలు చేశారు. గురువారం 5కేజీల లడ్డూకు వేలంపాట నిర్వహించారు. తాజొద్దీన్, మహమ్మద్ వేలంపాటలో రూ.15వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో యువకులు మహిమూద్, పవన్, గణేశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: నలుగురికి గాయాలు

అమరచింత, సెప్టెంబరు 12: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులకు గాయాలయ్యాయి. గురువారం పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహం శివారులో ప్రధాన రహదారిపై మద్యం దుకాణం వద్ద అమరచింతకు చెందిన కురువ వెంకటేష్, కురువ రవి ఆత్మకూరు నుంచి అమరచింత వైపు వస్తుండగా అక్కడ నిలిచి ఉన్న క్రాంతి, అనిల్ తమ ద్విచక్ర వాహనాన్ని మళ్లించుకుని వచ్చే ప్రయత్నంలో అదుపు తప్పి రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో కురువ రవికి తీవ్ర గాయాలు కాగా, వెంకటేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్రాంతికి తీవ్ర గాయాలు కాగా అనిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హుటాహుటిన అక్కడున్న వారు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించగా, కురువ రవి, క్రాంతిని హైదరాబాద్ తరలించారు. అతివేగంతో పాటు ప్రధాన రహదారిపై మద్యం దుకాణం ఉండడం వల్ల అక్కడ చాలా వాహనాలు ఆగి ఉండడంతో ప్రమాదం జరిగి ఉంటుందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

విద్యార్థులు ఆటపాటల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు, ఉపాధ్యాయులు

కొత్తకోట, సెప్టెంబరు 12 : విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని మునిసిపల్ చైర్‌పర్సన్ సుకేశిని అన్నారు. గురువారం మండలస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుకేశిని మాట్లాడుతూ చదువు, క్రీడల్లో నైపుణ్యం సాధించిన విద్యార్థులు జీవితంలో రాణిస్తారన్నారు. మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏటా స్కూల్ గేమ్ ఫెడరేషన్ పేరుతో పోటీలు నిర్వహించి ప్రతిభగల వారిని జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం కబడ్డీ, వాలీబా ల్, ఖోఖో పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య తపస్, పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, గోపాల్ మునిసిపల్ కౌన్సిలర్ నారాయణమ్మ, నరేందర్‌రెడ్డి, జేసీబీరాము, మోహన్‌రెడ్డి వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అవగాహన కల్పించండి

మదనాపురం, సెప్టెంబరు 12: ఓటరు జాబితాపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ అబ్రహంలింకన్ అన్నారు. గురువారం ఆయన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం ప్రదర్శించే ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్న కుమారి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్లియాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న, బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి రాములు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి క్రాప్ బుకింగ్ చేయాలి

▸▸ వ్యవసాయ శాఖ అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆదర్శ్ సురభి



వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 12: పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాకే ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్ చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. అలా చేయకపోతే ఎరువుల సరఫరా, పంట కొనుగోలు తదితర సూక్ష్మ ప్రణాళికలు తప్పుతాయని తెలిపారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖకు సంబంధించిన క్రాప్ బుకింగ్, రుణమాఫీ కానీ రైతుల ఫ్యామిలీ గ్రూపింగ్, ఎరువుల వాడకం, అధిక వర్షాలవల్ల పంటనష్టం అంచనాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లకుండా ఇంటి వద్ద కూర్చొని క్రాప్ బుకింగ్ నమోదు చేస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు లక్ష్యం మేరకు క్రాప్ బుకింగ్ చేయని ఏఈఓలను కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారంరోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ రుణమాఫీ కానీ రైతుల ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 11వేల మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయని తెలిపారు. ఎరువుల వాడకంపై ప్రతి మంగళవారం రైతు వేదికల్లో అవగాహన కల్పించాలని, చీడల నివారణ, మందుల వాడకంపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలని ఆదేశించారు. జొన్న రైతులు కంకులు రోడ్లపై వేస్తున్నారని అది చాలా ప్రమాదకరమని, రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతుందన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటనష్టం అంచనాలపై నిబంధనలు పాటించాలని సూచించారు. వర్షాల వల్ల 33శాతానికి పైగా నష్టం జరిగితే పంట నష్టం కింద పరిగణించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, ఏడీఏ కొత్తకోట దామోదర్, ఏడీఏ శివనాగిరెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం అధికారులను సంప్రదించాలి

రుణమాఫీ కానీ అర్హులైన రైతులు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి తమ ఫ్యామిలీ గ్రూపింగ్ చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం ప్రకటనలో తెలిపారు. రైతులు తప్పనిసరిగా తన ఫ్యామిలీ గ్రూపింగ్ ఆన్‌లైన్ ద్వారా చేయించుకోవాలని అప్పుడే రుణమాఫీ వర్తిస్తుందని, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. వచ్చే నాలుగు అయిదు రోజుల్లో ఆన్‌లైన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

బియ్యం ఇవ్వని మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతాం

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు బియ్యం ఇవ్వని మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామని కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. సెలవు దినాలతో సంబంధం లేకుండా ప్రతి రోజు నిర్దేశించిన మొత్తంలో బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులతో బియ్యం అప్పగింతపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు ఏ రైస్ మిల్లు ఎంత ధాన్యం అప్పగించింది ఇంకా ఇవ్వాల్సిన ధాన్యం ఎంత అనే దానిపై మిల్లుల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికీ జిల్లా నుంచి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సివిల్ సప్లయ్ శాఖకు ఇవ్వాల్సిన ధాన్యం చాలావరకు పెండింగ్ ఉందని తెలిపారు. అందువల్ల వచ్చే 20రోజులు నిర్దేశించిన మొత్తంలో ప్రతిరోజు బియ్యం, ఉప్పుడు బియ్యంకూడా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్లు, సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. బియ్యం ఇచ్చే మిల్లులకు ప్రోత్సాహం ఇవ్వనున్నామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, డీఎం ఇర్ఫాన్, తహసీల్దార్ పాల్గొన్నారు.

నేడు ఓటర్ల జాబితా ప్రదర్శించాలి

శుక్రవారం ఉదయం 10గంటలలోపు అన్ని గ్రామ పంచాయతీల నోటీసు బోర్డుపై ఓటర్ల జాబితా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల షెడ్యూల్‌పై అవగాహన కల్పించారు. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదులు తీసుకోవాలన్నారు. ఎన్నికల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ఈనెల 18న కలెక్టరేట్‌లో సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీపీవో సురేష్, జెడ్పీ సీఈవో యాదయ్య, ఆర్‌డీవో పద్మావతి, డీఎల్‌పీవో రఘునాథ్, అడిషనల్ డీఆర్‌డీవో నాగేంద్రం, సి-సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్‌నాయక్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడిన సీతారాం ఏచూరి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 12: పేదప్రజల సమస్యలపై పోరాటం సాగించిన ఏచూరి సీతారాం ఆశయ సాధన కోసం కృషి చేద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం మృతిపట్ల సీపీఎం జిల్లా నాయకులు గురువారం సంతాపం తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి రాజీవ్‌చౌరస్తా వరకు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏచూరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు అడ్వకేట్ నాగేశ్వర్, పుట్ట ఆంజనేయులు, జీఎస్ గోపీ, బాల్‌రెడ్డి, మేకల ఆంజనేయులు, లక్ష్మి, మండ్ల రాజు, కృష్ణయ్య, రమేష్ రాజు, నందిమల్ల రాములు, ఉమా పాల్గొన్నారు.

ఏచూరి మరణం దేశానికే తీరని లోటు

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం అకాల మరణం సీపీఎం పార్టీతో పాటు దేశానికే తీరని లోటు అని మాజీ పార్లమెంట్ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ కారణంగా ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఏచూరి సీతారాం గురువారం మృతి చెందడం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. రాజ్యసభలో ఏచూరి, తాను కలిసి పనిచేశామని, ఎంతో ఉన్నత విలువలతో, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం తన గళాన్ని రాజ్యసభలో వినిపించారని పేర్కొన్నారు. ఏచూరి మృతిపట్ల తన ప్రగాఢ సానుభూతితో పాటు ఆయన కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని కోరుతున్నానని పేర్కొన్నారు.

అమరచింతలో..

అమరచింత, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి మృతి పట్ల గురువారం సాయంత్రం అమరచింతలో సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ 5వ వార్డులో సీపీఎం జెండాను అవగతం చేసి, మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు అజయ్, శ్యామ్ సుందర్, బుచ్చన్న, విజయ్, షేక్ పాషా, అరుణ్, నిశాంత్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్ క్రీడా జట్ల ఎంపిక పూర్తి



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న వాకిటి శ్రీధర్, డీవైఎస్‌వో సుధీర్ కుమార్‌రెడ్డి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, సెప్టెంబరు 12: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జట్ల ఎంపికను గురువారం జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీధర్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ ఈనెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు క్రీడా జట్ల ఎంపిక పూర్తి చేసినట్లు తెలిపారు. అండర్ 16, 18, 20 ఏళ్ల విభాగాలలో క్రీడాకారుల ఎంపిక జరిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నందమూరి శ్రీకాంత్, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు స్వామి, యువరాజు, ఆంజనేయులు, దామోదర్, మహేష్, సింధు, చిట్టెమ్మ, త్రివేణి, మంజుల, రాజప్ప, కిషోర్, కవిత, ప్రవీణ్, చంద్రకళ, సుజాత, శ్రీనివాస్ రెడ్డి, విజయ్ కృష్ణ, నవీన్, భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సాధించి తీరుతాం



మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

కొత్తకోట, సెప్టెంబరు 12: ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను పీఆర్టీయూ టీజీ ఆధ్వర్యంలో సాధించి తీరుతామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పీఆర్టీయూ టీజీ సభ్యత్వాల కార్యక్రమం సందర్భంగా కొత్తకోట, అమడబాకుల, అప్పరాల, పామాపురం ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాకమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నమన్నారు. ఎంఈవో, డైట్ లెక్చరర్లు, డిప్యూటీ డీఈవో, జూనియర్ కళాశాలల లెక్చరర్ల పదోన్నతులు పొందడానికి కృషి చేస్తామన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించి 010 పద్దు కింద జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివా సులు ఉపాధ్యక్షులు నాగరాజు, మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశకీర్తిని పెంచిన ఘనత మోదీదే..



ధర్మాపూర్‌లో సభ్యత్వం చేయిస్తున్న లక్ష్మీకాంత్ రెడ్డి

అమరచింత, సెప్టెంబరు 12: భారతదేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిన ఘనత మన ప్రధాని మోదీకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ధర్మాపూర్, మిట్టనందిమల్ల, మస్తీపూర్, నందిమల్ల, కృష్ణంపల్లి, కొంకనివానిపల్లి, పామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా గ్రామాల్లో బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను కార్యకర్తలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ మరాఠీ అశోక్, రూరల్ అధ్యక్షుడు హరీష్, మల్లారెడ్డి, భీమ్ రెడ్డి, సభ్యత్వ నమోదు మండల కో కన్వీనర్ చిన్న మల్లేష్, విజయరామ్, మీసాల అశోక్, శ్రీను, జనార్దన్ రెడ్డి, మల్లేష్ , రాజు తదితరులు పాల్గొన్నారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 12: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలను, వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలను, వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి, దెబ్బతిన్న పంటలు, పశువులు, ఆస్తులకు నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో పక్షం రోజుల పాటు వర్షాలు కురిశాయని, దీంతో ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. వరదల వల్ల రూ. 10300 కోట్లు భారీనష్టం జరిగినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణశాఖ అంచనా వేసిందన్నారు. ఈ మేరకు కేంద్రం వెంటనే రాష్ట్రానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలకు మరణించిన బాధిత కుటుంబాలకు రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇండ్లు కూలిపోయిన బాధితులకు రూ.25వేలు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.15వేలు తక్షణ సహాయంగా అందించాలన్నారు. పశువులు మరణించిన వారికి నష్టపరిహారం ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు రమేష్, శ్రీహరి, గోపాలకృష్ణ, కళావతమ్మ, మోష, భాస్కర్, చిన్న కురుమయ్య, రమణ, అంజి, బాలకృష్ణ, అడివన్న, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాతపల్లి నిందితులను వెంటనే శిక్షించాలి

- కేఏఎన్‌పీఎస్ జిల్లా కన్వీనర్ గోవిందు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 12: పాతపల్లిలో హుస్సేన్ హత్యకు పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జిల్లా కన్వీనర్ ఈరపాగ గోవిందు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఎనుముల హుస్సేన్ 5వ సంస్మరణ సభను కేఏఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపల్లి దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలన్నారు. కుల దురహంకారంతో హుస్సేన్‌ను హత్యచేసిన నిందితులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాతపల్లి పోరాటాన్ని గమనంలోకి తీసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో హుస్సేన్ పాత్ర ఎంతో ఉందన్నారు. సమావేశంలో నాయకులు గంధం నాగరాజు, చెన్నకేశవులు, శివనాయక్, బాలేమియా, మల్లెపు నరసింహ, కురుమయ్య రామచంద్రయ్య, చక్రవర్తి, బండారి లక్ష్మ య్య మైనుద్దీన్, నాగరాజు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందే..

వనపర్తి రూరల్, సెప్టెంబరు 12: ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం , కడుకుంట్ల , చిట్యాల తదితర గ్రామాల్లో వనపర్తి మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్ గౌడ్, మండల అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, మనోహర్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ శశివర్ధన్ , జిల్లా టెక్నికల్ కన్వీనర్ మల్లేష్ , కో కన్వీనర్ నరేష్, రాములు, వీర శేఖరచారి, తదితర తపస్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

పెద్దమందడి, సెప్టెంబరు12: నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జెడ్పీహెచ్ఎస్ కర్నీ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పెద్దమందడి జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న లిఖిత ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లోని మౌలాలిలో జరిగే సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం శాంతన్న, ఫిజికల్ డైరెక్టర్ మన్యం యాదవ్ తెలిపారు.

పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 12: పోషకాహారంతోనే గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. మండలంలోని మూలమల్లలో గురువారం పోషణమాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణీ, బాలింతలు, కిషోర బాలికల ఆరోగ్యం కొరకు పాలు, గుడ్లు, బాలామృతం , పోషక విలువలతో కూడిన భోజనం, ఐరన్ మాత్రలు అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రోజు వారీగా ఆకు కూరలు, పండ్లు తినడం వలన పోషక విలువలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, సంధ్యారాణి, విజయలక్ష్మి, కజియబేగం, మాసుంబి, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

వీపనగండ్ల, సెప్టెంబరు12: మండల కేంద్రంలోని జగ్జీవన్‌రామ్ కాలనీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎంపీడీవో శ్రీనివాసరావుకు కాలనీవాసులు గడ్డమీద రాధాకృష్ణ, మీసాల శివప్రసాదు వినతి పత్రం అందించారు. మురుగునీరు రెండు సంవత్సరాలుగా రోడ్డుపై పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, దోమల బెడద తీవ్రమైందని, కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. 20ఫీట్ల రోడ్డు ఆక్రమణకు గురైందని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 12: మండల పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన ఉసెన్‌బీ పురిటి నొప్పులు రావడంతో 108కి సమాచారం అందించారు. కడుకుంట్ల అంబులెన్స్‌లో ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమై, ఆమె అంబులెన్స్‌లోనే మగబిడ్డను ప్రసవించిందని ఈఎంటీ శశికుమార్ , పైలెట్ మైనుద్దీన్ తెలిపారు. తల్లీ బిడ్డను పెబ్బేరు పీహెచ్‌సీలో అడ్మిట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

పాన్‌గల్, సెప్టెంబరు 12: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా మహిళ సాధికారిత కేంద్రం వనపర్తి వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్ప్‌లైన్ 1098 ప్రాముఖ్యత, చైల్డ్ లేబర్, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్ విషయాలపై కోఆర్డినేటర్ భాస్కర్, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జనరల్ స్పెషలిస్టు సలోమి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తకోట, సెప్టెంబరు 12: మండలంలోని సంకిరెడ్డిపల్లికి చెందిన కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 11వ రోజు కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ విద్యార్థి సంఘం నాయకుడు ముస్తఫా, కృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో నాయకులు మన్నెం, రాజశేఖర్ ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాన్‌గల్, సెప్టెంబరు 12: మండలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చింతకుంటలో డెంగీబారిన పడిన బాధితులు గాయత్రి, కురుమయ్య కుటుంబాలను, బాధితులను పరీక్షించారు. పరిసర ప్రాంతాల్లోని ప్రజల రక్త నమూనాలను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ మండల ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ నాగరాజు, సూపర్‌వైజర్ శాంతమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, యాంటి లార్వో టీం సభ్యులు గోపాల్ రెడ్డి, సతీష్, రాజశేఖర్‌రెడ్డి, ఏఎన్ఎం ఎస్తేరమ్మ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రత, ప్రభుత్వ పథకాలపై అవగాహన

పాన్‌గల్, సెప్టెంబరు 12: మండల పరిధిలోని గోప్లాపూర్‌లో గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సీజనల్ వ్యాధులు, ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీలపై పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో కురుమయ్య, పంచాయతీ కార్యదర్శి విష్ణు, ఏఎన్ఎం నాగేశ్వరి, అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు, కళాకారులు కృష్ణయ్య శివలింగం, శ్రీనివాసులు, నరసింహరాజు, సువర్ణ, గ్రామస్తులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లతో పోలీసులు

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 12: మండలంలోని రాంపురం గ్రామ సమీపంలోని కృష్ణానది పరిసర ప్రాంతం నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. బున్యాదిపురం గ్రామ సమీపాన పట్టుకొని ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులో మునిగి యువకుడి దుర్మరణం

పాన్‌గల్, సెప్టెంబరు 12: మండల పరిధిలోని దొండాయిపల్లికి చెందిన పెద్ద ముక్కుల ఆంజనేయులు (28) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి చనిపోయినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడు పశువులను మేపేందుకు వెళ్లి, మొండికుంట చెరువులో ఈతకు దిగాడు. నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు.